

సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

# రాహుల్‌కు చేయిచ్చి..

## పార్లమెంట్ ఎన్నికల తర్వాత మరో ఏక్‌నాథ్‌షిండే.. రేవంత్‌రెడ్డి : కేటీఆర్

- ఎన్నికలయ్యాక ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకోవటం ఖాయం
- మోదీ సభలో సీఎం మాట్లాడిన మాటలే అందుకు నిదర్శనం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్, ఉత్తమ్‌వి అడ్డగోలు మాటలు
- రైతులపై పగబట్టిన దిక్కుమాలిన, దివాలాకోరు పార్టీ కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 5 (నమస్తే తెలంగాణ): 'పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకోవటం ఖాయం. మరో ఏక్‌నాథ్‌షిండే.. మరో హిమంతబిశ్వశర్మ ఇక్కడే పుడతడు. కాంగ్రెస్‌ను బొందపెడ్తడు. ఆషామాషీగా చెప్తలేను. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతోనే చెప్తున్నా. మోదీ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలే చెప్తున్నాయి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాల్లో పాల్గొన్న ఆయన.. 'ఎన్నికలు రెండు నెలలు లేవు. భవిష్యత్తులో మీ ఆశీర్వాదం ఉండాలని ఈ టైంల మోదీని రేవంత్ అడిగిండు. అంటే అర్థమేంది? మా రాహుల్‌గాంధీ తట్టపార వేస్టు కేసు.. గెలిచేది లేదు.. పీకేది లేదు.. మళ్లీ మీరే ప్రధాని అని చెప్పినట్టు కాదా? కాంగ్రెస్ సీఎం ఎవడైనా మెడకాయ మీద తలకాయ ఉన్నోడు భవిష్యత్తులో ప్రధానిగా నరేంద్రమోదీ ఉండాలని ఎలక్షన్ల ముందు అంటడా? దీని ఉద్దేశం రాహుల్‌గాంధీ వేస్ట్‌ఫెలో, సన్నాసి.. ఆయనతో కాదు.. నువ్వే ప్రధాని అని కాంగ్రెస్ సీఎం చెప్తే ఏమనుకోవాలి? ఇది దివాలాకోరు రాజకీయం కాదా? రాష్ట్రంలో కాంగ్రెస్ దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నది. ఏం జరుగుతున్నదో ఓసారి ఆలోచించండి' అని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లలో తెలంగాణ గిరిజనులు, రైతులు, విద్యార్థులకు ఏం చేసింది? అని అన్నారు. రామమందిరం పేరు చెప్పి, రాముడిని అడ్డం పెట్టుకొని మళ్లీ ఓట్లు దండుకునే చిల్లర ఆలోచన చేస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో ఒకటి, రెండు పిల్లర్లలో సమస్య వస్తే.. రిపేర్లు చేయకుండా బరాజ్‌ను డ్యామేజీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దివాలాకోరు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్‌పై కోపాన్ని రైతుల మీద తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో మల్లన్నసాగర్ ద్వారా కూడెల్లి వాగు, నర్మాల ప్రాజెక్టు నింపి అన్ని గ్రామాలకు కాళేశ్వరం జలాలు అందించామని గుర్తు చేశారు. ఈసారి నీళ్ల సంగతేంటని కాళేశ్వరం సీఈని అడిగితే.. ఏప్రిల్, మేలో కేసీఆర్ విలువేందో తెలుస్తదని, మీరు యాదిపెట్టుకోవాలని సమాధానం ఇచ్చినట్టు చెప్పారు.

### సిగ్గులేని సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు పత్రాలు ఇస్తూ తానే ఉద్యోగాలిచినట్టు చెప్పుకుంటున్న సిగ్గులేని, దగుల్బాజీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్ వచ్చినంక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా ఉద్యోగాలు ఇచ్చినట్టు సీఎం ప్రచారం చేసుకుంటున్నరు. పోలీసు, నర్సు ఉద్యోగాలు ఇచ్చినట్టు సిగ్గు లేకుండా ప్రచారం చేసుకుంటున్నరు. ఎప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారు?' అని ప్రశ్నించారు. బతుకమ్మ చీరలు క్యాన్సిల్ చేసి నేతన్నల పొట్ట కొట్టొద్దని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశానని తెలిపారు. నేతన్నలను అవమానపరిచిన కేకే మహేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాకే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు రావాలని డిమాండ్ చేశారు. తనపై కోపంతో సిరిసిల్ల నేతన్నల కొంపముంచే ప్రయత్నం చేస్తున్నారని, కేసీఆర్ మీద కోపంతోని కాళేశ్వరం ప్రాజెక్టు దండగంటూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.

### రైతులు బాధపడుతున్నరు

కాంగ్రెసోళ్లు కొత్త బిచ్చగాడొచ్చినట్లు ఎగిరెగిరి పడుతున్నారని, ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టంగనే పోలీసులతో ఫోన్ చేయించి బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ పరిస్థితి ఒక సిరిసిల్లలోనే కాదని, అంతటా ఇలాగే ఉన్నదని చెప్పారు. ప్రజలను మోసం చేసి 420 లంగ హామీలు, దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. రూ.2 లక్షల లోను తెచ్చుకోండి.. డిసెంబర్ 9న రుణమాఫీపై సంతకం పెడుతానని మోసం చేయలేదా? అని ప్రశ్నించారు. రైతులు మోసపోయామని బాధపడుతున్నారని అన్నారు.

### మనకు చేయరాదా రాజకీయం?

కాంగ్రెస్, బీజేపీ గెలిస్తే ఢిల్లీలో ఉస్కో అంటే ఉస్కో, డిస్కో అంటరు తప్ప ఎవరు పార్లమెంటులో మాట్లాడరని కేటీఆర్ విమర్శించారు. వీళ్లకు సొంతంగా వెన్నెముక ఉండదని, దమ్ముండదని అన్నారు. ఎప్పటికైనా మాట్లాడేది, కొట్లాడేది గులాబీ జెండా మాత్రమేనని, కొట్లాడాలంటే అది కేసీఆర్ దళానికే సాధ్యమని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట గుడి కట్టిన కేసీఆర్ రాజకీయం చేశారా? అని ప్రశ్నించారు. 'ఇంటింటికీ యాదాద్రి ఫొటోలు, అక్షతలు పంపపోదుమా? దేవుడి పేరిట రాజకీయం చేయకుండా చేసిన అభివృద్ధి పనులనే చెప్పుకుంటూ ముందుకు వెళ్లాం' అని చెప్పారు.

### ఏడేండ్లు తండ్లాడినా మొండిచెయ్యి చూపిండు

'మొన్న ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటిస్తే సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆహ్వానించటం.. సభలో పాల్గొనటం.. అంత వరకు బాగానే ఉన్నది. బీఆర్‌ఎస్ సర్కారు కూడా 2014 నుంచి 2021 వరకు మోదీకి ఎంత గౌరవం ఇయ్యాల్నో అంతకన్నా ఎక్కువే ఇచ్చింది. మేం కూడా లైన్ కట్టి నిలబడి, మస్తు రిసీవ్ చేసుకున్నం. మస్తు కలిసినం. ఆయన పిలిస్తే సీఎం, మంత్రులం తండోపతండాలుగా పోయినం. ఏడేండ్లు తండ్లాడినం. అయినా ఏమైంది? మొండి చెయ్యి తప్ప. 2021 నుంచి పోవుడు కూడా బంజేసినం. ఈ పెద్దమనిషి వస్తడు.. చేతులు ఊపుకుంట పోతడు. ఏపీలో కొత్త రాజధాని కట్టుకుంటే తట్టెడు మట్టి.. లొట్టెడు నీళ్లు తప్ప ఏం ఇయ్యలేదు. మనకు కూడా ఏడేండ్లలో ఏమీ ఇయ్యలే. కలుసుడు దండుగ అని పోవుడు బంజేసినం. సరే కొత్త మురిపెం కాబట్టి రేవంత్‌రెడ్డి పోయిండు. రిసీవ్ చేసుకున్నడు. సభలో పాల్గొన్నడు. అంతవరకు బాగానే ఉన్నది. కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే.. దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ మాడల్‌ను కాదని, గుజరాత్ మాడల్‌ను కాపీ కొట్టి రాష్ట్రాన్ని మంచిగా చేసుకుంట అని చెప్తడా? ఇదే ముఖ్యమంత్రి మూడు నెలల క్రితం ఏముంది గుజరాత్ మోడల్? అని ప్రశ్నించారు. గుజరాత్ మాడల్ అంటే మతం పేరు మీద చంపుడా? మనుషులను బొందపెట్టుడా?' అని అడిగారు.

### వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

ఉద్యమంలో మనతో కలిసి పనిచేసిన విద్యావంతుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఉచితంగా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించే పార్టీ ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెల 12న కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ మైదానంలో చేపట్టే బహిరంగసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రవీణ్, మండల శాఖల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇద్దరు రైతుల ఆత్మహత్య



ఆనందాస్ మహేశ్(ఫైల్)



గువ్వాడి మోహన్‌రావు(ఫైల్)

చేగుంట/ గీసుగొండ మార్చి 5 : వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మెదక్ జిల్లా నార్సింగ్ మండలం వల్లూర్ గ్రామానికి చెందిన ఆనందాస్ మహేశ్(35) చేసిన అప్పులు తీర్చేందుకు కొద్ది రోజుల క్రితం తన వ్యవసాయభూమిని విక్రయించాడు. భూమి లేకపోవడంతో ఎలా బతకాలి, కుటుంబాన్ని ఎలా పోషించాలి అని ఆలోచిస్తూ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం మాల గుట్ట వద్ద మహేశ్ చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని గ్రామస్తులు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఆరెపల్లిలో గువ్వాడి మోహన్‌రావు(32) పంట పెట్టుబడి కోసం అదే గ్రామానికి చెందిన పలువురి వద్ద నుంచి రూ. 3 లక్షల వరకు అప్పులు తీసుకున్నాడు. మక్కజొన్న, పత్తి పంటలు అనుకున్న స్థాయిలో పండకపోవడంతో తీవ్రమనస్తాపం చెంది మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో తన ఇంటి ఆవరణలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి అక్కడే పడిపోయాడు. కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే 108 ద్వారా ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాబులాల్ తెలిపారు.

# పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్

- ఈ నెలారంభం నుంచి 15 వేల మెగావాట్లకుపైగా డిమాండ్
- రానున్న రోజుల్లో మరింతగా విద్యుత్తు డిమాండ్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. మార్చి నెల ప్రారంభం నుంచే 15,000 మెగావాట్లను దాటడం గమనార్హం. గడిచిన నాలుగు రోజుల్లో 15 వేల మెగావాట్లను దాటి గరిష్ఠ డిమాండ్ నమోదైంది. మార్చి ఒకటిన 15,110 మెగావాట్లు, మార్చి 2న 15,060 మెగావాట్లు, మార్చి 3న 14,477 మెగావాట్లు, మార్చి 4న 15,089 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదు కాగా..మంగళవారం రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 15,125 మెగావాట్లుగా నమోదైంది. నిరుడు ఇదే రోజు నమోదైన గరిష్ఠ డిమాండ్ 14,115 మెగావాట్లు. అంటే ఏడాదిలో1,010 మెగావాట్ల అదనపు డిమాండ్ ఏర్పడింది. నిరుడు మార్చిలో నమోదైన 15,497 మెగావాట్ల అత్యధిక డిమాండ్ రికార్డును ఈ నెలలోనే దాటిపోయే అవకాశముందని విద్యుత్తు శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 4న రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్తు వినియోగం 294.41 మిలియన్ యూనిట్లుగా నమోదయ్యింది. ఈ గరిష్ఠ డిమాండ్, వినియోగం ఇలాగే పెరగడం ఏప్రిల్, మే వరకు కూడా ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. వరి కోతల సమయానికల్లా విద్యుత్తు డిమాండ్, వినియోగంలో తగ్గుదల ఉంటుందని, అప్పుడు వ్యవసాయం వినియోగం తగ్గి, గృహ, వాణిజ్య, పారిశ్రామిక డిమాండ్, పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# 'ఎల్‌సీలకు అనుమతించండి'

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్)లకు అనుమతివ్వాలని కోరుతూ తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఎస్‌పీడీసీఎల్ సీఎండీకి విజ్ఞాపన పత్రాలు సమర్పించాయి. ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకోవడం నిరంతర ప్రక్రియ అని, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ కొత్తలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ప్రభుత్వం ఎల్‌సీల విషయంలో తీవ్రంగా చర్యలు తీసుకుందని, కొత్త వినియోగదారులకు విద్యుత్తు సరఫరా కనెక్షన్ ఇవ్వలేకపోతున్నామని, వినియోగదారులకు, పనులు పూర్తిచేసిన తమకు నష్టం వాటిల్లుతున్నదని, వీటిని పరిశీలించాలని విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నాయి.

### వానకాలం నుంచి పంటల బీమా

- అన్ని పంటలకు వర్తించేలా పథకం
- నేడు సచివాలయం నుంచి ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : వచ్చే వానకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమాను అమలు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కొత్త బీమా పథకాన్ని అన్ని పంటలకు వర్తింపజేస్తామని, రైతుల వాటా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పంట నష్టాన్ని కచ్చితత్వంతో అంచనా వేసేందుకు ఎస్-టెక్, విండ్స్, క్రాపిక్, శాటిలైట్ ఇమేజ్ అప్లికేషన్స్, డేటాను వినియోగించనున్నట్టు తెలిపారు. తక్షణ పంట నష్టం అంచనా వేసి పరిహారాన్ని డీబీటీ ద్వారా అందిస్తామని తెలిపారు.

**రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్...**

రైతులకు పంటల సాగులో మేలైన సాగు పద్ధతులను నేర్పించడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అన్ని రైతు వేదికల్లో రైతునేస్తం పేరుతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2061 రైతువేదికలుండగా తొలి దశలో 110 చోట్ల కార్యక్రమాన్ని చేపడతామని, బుధవారం సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి 'రైతునేస్తం'ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం వ్యవసాయ యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తలు, ఆదర్శరైతులు ఆయా గ్రామాల్లోని రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు కొత్త సాగు విధానాలు, పంటలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

# ఆ 30 వేల ఉద్యోగాలు కేసీఆర్ సృష్టి కాదా?

- ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలి
- గుజరాత్ మాడల్ అంటే గోద్రాగా మార్చడమా?
- పాథాలజికల్ లయర్ రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్



హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని నిస్సిగ్గుగా అబద్ధాలాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాథాలజికల్ లయర్‌గా మారిపోయారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం నియామకపత్రాలు అందజేస్తున్న ఆయా ఉద్యోగాల సృష్టికర్త కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి తెలివి, సమర్థత ఉంటే కొత్త ఉద్యోగాలను సృష్టించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామక ప్రక్రియలో ఉన్న ఉద్యోగాలను కలుపుకొని రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారా? అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించి ఇస్తామని చెప్పారా? స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. ఏ దొడ్లో కడితే ఏమిటి నా దొడ్లో ఈనితే చాలదా? అన్నట్టుగా రేవంత్ వ్యవహారశైలి ఉన్నదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాను తన ఖాతాలో చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలను ఎక్కడ గుర్తించారో, ఎలా సృష్టిస్తారో, ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు, చేపలు ఇస్తే.. తాము ఉద్యోగాలు ఇచ్చామంటూ కులవృత్తులను అవమాన పరిచేలా రేవంత్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ మాటలు ఆధిపత్య అప్పర్ క్లాస్ ప్యూడలిజానికి నిదర్శనమని విమర్శించారు. ప్రధాని మోదీని బడేభాయ్ అంటున్న రేవంత్‌రెడ్డి, తమ మధ్య ఒప్పందం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ఒకవైపు మోదీని గద్దె దించాలని చూస్తుంటే, రేవంత్ మాత్రం మోదీయే ప్రధానిగా ఉండాలని కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇది మోదీతో రేవంత్ పెట్టుకున్న పొత్తుకు నిదర్శనమని ఆరోపించారు. గుజరాత్ మాడల్ అబద్ధాల మాడల్ అని కాంగ్రెస్ అధిష్ఠానం అంటుంటే.. రేవంత్ మాత్రం గొప్ప మాడల్ అంటున్నారని దుయ్యబట్టారు. గుజరాత్ మాడల్ అనేది అట్టర్‌ఫ్లాప్ మాడల్ అని వివరించారు. రేవంత్ దృష్టిలో గుజరాత్ మాడల్ అంటే తెలంగాణను గోద్రాగా మార్చడమా? అని ప్రశ్నించారు.

# మినీ తిరుపతిగా స్వర్ణగిరి వేంకన్న సన్నిధి



### నేడు స్వామివారి ప్రాణప్రతిష్ఠ.. ప్రముఖుల హాజరు

యాదాద్రి భువనగిరి, మార్చి 5 (నమస్తే తెలంగాణ): భువనగిరి పరిధిలోని పగిడిపల్లిలో అద్భుతంగా నిర్మించిన వేంకటేశ్వర క్షేత్రం మినీ తిరుపతిగా విరాజిల్లనున్నది. 22 ఎకరాల్లో అత్యంత సుందరంగా రూపుదిద్దుకున్న ఈ ఆలయానికి స్వర్ణగిరి అని నామకరణం చేశారు. త్రిదండి చినజీయర్ స్వామి బుధవారం ఈ ఆలయంలో స్వామివారికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త మానేపల్లి రామారావు ఈ ఆలయాన్ని నిర్మించారు.

# రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీల డిమాండ్

ఖమ్మం, మార్చి 5: నగరంలోని వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డులో దళారీల దోపిడీని అరికట్టాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఖమ్మంలోని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించాయి. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు డేవిడ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, వెంకట్రామిరెడ్డి, ప్రకాశ్, వెంకన్న, జీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలిచ్చింది కేసీఆర్ సర్కారే

- నియామకపత్రాలిచ్చి పోజులు కొడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత గోసుల శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : సొమ్ముకొకరిది.. సోకొకరిది అన్న సామెత సీఎం రేవంత్‌రెడ్డికి నూటికి నూరుపాళ్లు సరిపోతుందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత గోసుల శ్రీనివాస్ యాదవ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ సర్కార్ తొమ్మిదిన్నరేండ్లలో లక్షా 40వేల ఉద్యోగాలిచ్చి, మరో 30వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయ్యే దశలో నియామక పత్రాలు అందజేసి ఇది తమ ప్రభుత్వ ఘనతేనని రేవంత్‌రెడ్డి పోజులు కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నదని, ప్రజలేమీ అమాయకులుకారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ మూడు నెలల్లో ఇచ్చిన నోటిఫికేషన్లు, పరీక్షలు నిర్వహించినవి, ఫలితాలు ప్రకటించిన ఉద్యోగాల సంఖ్య ఎంత? అని ప్రశ్నించారు. కనీసం ఒక్క నోటిఫిషన్ కూడా జారీ చేయకుండా కేసీఆర్ సర్కార్ చేపట్టిన ఉద్యోగ నియామకాలను తామే భర్తీ చేసినట్టు చెప్పుకోవటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. సరూర్‌నగర్ సాక్షిగా యువత డిక్లరేషన్‌లో నిరుద్యోగ భృతి రూ. 4000 ఇస్తామని చెప్పి తీరా మాట మార్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఎన్నికల్లో ప్రకటించిన 6 గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తామంటే కుదరదని పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

### భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్పష్టీకరణ



మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, మార్చి 5: 'నేను బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నేను కడ వరకు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతాను' అని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు నమ్మకాన్ని వమ్ముచేసే వ్యక్తిత్వం తనది కాదని పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయనని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్ముందు మంత్రులనూ కలుస్తానని చెప్పారు. 11న భద్రాచలంలో సీఎం పర్యటించనున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాసమస్యలను గుర్తించి సీఎంకు నివేదించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ భద్రాచలం మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెళ్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు సత్యనారాయణమూర్తి, రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, నర్రా రాము, బొంబోతుల రాజీవ్, గాడి విజయ్, చుక్కా సుధాకర్, మామిడి పుల్లారావు, పెద్దినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేను ఏ పార్టీలోనూ చేరడం లేదు

- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్



హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): తాను బీజేపీలో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ ఖండించారు. తాను ఏ పార్టీ లోనూ చేరటం లేదని స్పష్టంచేశారు. కేసీఆర్ నాయకత్వంలో తాను ప్రాతినిధ్యం వహించిన వర్ధన్నపేట నియోజకవర్గాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశానని తెలిపారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని ఖండిస్తున్నానని తెలిపారు. కేసీఆర్‌తో నాయకత్వంలోనే కొనసాగుతానని స్పష్టంచేశారు. ఇతర పార్టీల నేతలు తన గురించి చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని శంకర్ విజ్ఞప్తి చేశారు.


